సాక్షి అనంతపురం

సోమవారం ǀ 19 ǀ ఆగస్టు ǀ 2024



టమాట కిలో రూ.22
కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. మార్కెట్‌కు 3 వేల టన్నుల సరుకు వచ్చింది.



అనుబంధాలకు ప్రతీక 'రాఖీ'
అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్ల బంధానికి ప్రతీకగా నిలిచిన రాఖీ పండుగ రానేవచ్చింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో, పట్టణాల్లో సందడి నెలకొంది.

8లో

గరిష్టం/కనిష్టం
37.1°/24.3°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత అధికంగా ఉంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఉద్యాన పంటలకు రూ.1.07 కోట్ల నష్టం



కంబదూరు సమీపంలో నీట మునిగిన పంట

అనంతపురం అగ్రికల్చర్: కొన్ని మండలాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉద్యాన పంటలకు రూ.1.07 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఆ శాఖ జిల్లా అధికారి బీఎంవీ నరసింహారావు తెలిపారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, రాయదుర్గం, గుమ్మఘట్ట, శింగనమల, నార్పల, పుట్లూరు, పెద్దపప్పూరు, గుంతకల్లు, కళ్యాణదుర్గం, వజ్రకరూరు మండలాల పరిధిలో టమాట, ఎండుమిరప, అరటి, కర్బూజా, కళింగర, బీర, బంతి తదితర పంటలు 91 మంది రైతులకు చెందిన 74 హెక్టార్లలో దెబ్బతినడంతో రూ.1.07 కోట్ల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. మరోసారి పరిశీలించి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

15 మండలాల్లో వర్షం..
అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడా వర్షాలు పడుతున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 15 మండలాల పరిధిలో 7.9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. వజ్రకరూరు 62.2 మి.మీ, గుంతకల్లు 47.2, కంబదూరు 27.2, ఆత్మకూరు 20, కూడేరు 15, పామిడి 14.2, అనంతపురం 12.2, కుందుర్పి 10.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా.. మిగతా మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 83.8 మి.మీ కాగా.. ఇప్పటికే 111.8 మి.మీ నమోదైంది. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు.

తాడిపత్రి ఆలయాలను సందర్శించిన కలెక్టర్



బుగ్గరామలింగేశ్వర ఆలయ విశిష్టతను కలెక్టర్ దంపతులకు వివరిస్తున్న అర్చకులు

తాడిపత్రి అర్బన్: స్థానిక సుప్రసిద్ధ బుగ్గ రామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణ స్వామి ఆలయాలను ఆదివారం కుటుంబసమేతంగా కలెక్టర్ వినోద్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో ఈఓ సుబ్రహ్మణ్యం, అర్చకులు స్వాగతం పలికారు. చింతల వెంకటరమణస్వామి, ఆనంద వల్లి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు, స్వామి శేష వస్త్రాలను అందజేసిన అనంతరం ఆలయ విశిష్టతను ప్రధాన అర్చకుడు మురళీబట్టార్ వివరించారు. అలాగే బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బుగ్గ రామలింగేశ్వర స్వామి, పార్వతీదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంటపంలో కలెక్టర్ దంపతులను కూర్చోబెట్టి తీర్థప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అర్చకులు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయం వైభవాన్ని, విశిష్టతను వివరించారు.

'సరుకు మాయం'పై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల సరఫరాలో చోటు చేసుకున్న అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టారు. పౌష్టికాహారం పేరుతో పంపిణీ చేస్తున్న సరుకుల్లో నాణ్యత లేకపోవడం..మరికొన్ని మాయం కావడంపై 'సరుకు మాయం... నాణ్యత ఘోరం' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఐసీడీఎస్ పీడీ ఆదేశాల మేరకు సీడీపీఓ సాజిదాబేగం వెంటనే చర్యలు చేపట్టారు. సరుకుల సరఫరాలో ఎక్కడ గోల్‌మాల్ జరిగింది, ఏ అంగన్‌వాడీ కేంద్రానికి ఎంత మేర సరుకు పంపారు. నాణ్యత లోపించిన సరుకులు ఎంత శాతం ఉన్నాయో వెంటనే రిపోర్టు ఇవ్వాలంటూ ప్రాజెక్టులోని సెక్టార్ల సెల్ గ్రూపుల్లో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు సూపర్‌వైజర్లు మెసేజ్ పెట్టారు. అయితే విచారణ క్షేత్రస్థాయిలో కాకుండా తాము అడిగిన అర గంట లోపే పూర్తి వివరాలతో కూడిన సమాచారం అందించాలని ఆదేశించడం గమనార్హం. తప్పిదాలు కప్పిపుచ్చేందుకు సూపర్‌వైజర్లు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

తారలు దిగివచ్చే వేళ..

బ్యాటుతో రప్పాడేస్తారు. పరుగులతో హోరెత్తిస్తారు. కళ్లు చెదిరే సిక్సులు, ఫోర్లతో అలరించేస్తారు. ఎప్పుడూ టీవీలో కనిపించే అలాంటి తారలు మన నగరానికే వస్తున్నారు. వినోదం పంచనున్నారు. అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా గ్రామం దేశవాళీ క్రీడా సంరంభానికి సిద్ధమవుతుండగా, తమ అభిమాన క్రికెటర్ల రాక కోసం క్రికెట్ ప్రేమికులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.



దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్న ఆర్డీటీ స్టేడియం

- వచ్చే నెల 5 నుంచి దులీప్ ట్రోఫీ
- అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే టోర్నీకి ఆర్డీటీ స్టేడియం సర్వం సిద్ధం
- భారత జట్టులోని ముగ్గురు క్రీడాకారులు మినహా తక్కిన వారందరూ ప్రాతినిధ్యం
- సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, పంత్ తదితర స్టార్ క్రికెటర్ల రాక
- పండుగ చేసుకోనున్న అభిమానులు

టోర్నీ ప్రారంభమయ్యే తేదీ: సెప్టెంబర్ 5

అనంతలో జరిగే మ్యాచ్‌లు..	
సెప్టెంబర్ 5-8:	టీమ్- సీ వర్సెస్ టీమ్-డీ
సెప్టెంబర్ 12-15:	టీమ్-ఏ వర్సెస్ టీమ్-డీ టీమ్-బీ వర్సెస్ టీమ్-సీ
సెప్టెంబర్ 19-22:	టీమ్-బీ వర్సెస్ టీమ్-డీ టీమ్ -ఏ వర్సెస్ టీమ్-సీ

అనంతపురం: దేశవాళీ క్రికెట్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీలు అనంతపురంలో జరగనున్నాయి. వచ్చే నెల 5న టోర్నీ ప్రారంభం కానుండగా, అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో ఐదు మ్యాచ్‌లు జరుగుతాయి. ఒక మ్యాచ్ నాలుగు రోజుల పాటు (మల్టీడే మ్యాచ్) నిర్వహిస్తారు. అంతర్జాతీయ స్థాయిలో అయితే టెస్ట్ మ్యాచ్‌గా పరిగణిస్తారు. ఒక మ్యాచ్ ఐదు రోజుల పాటు సాగుతుంది.

క్రీడా గ్రామం ఖ్యాతి..
దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు తొలిసారిగా అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తుండడంతో జిల్లా పేరు దేశస్థాయిలో మార్మోగనుంది. 2003లో ప్రారంభించిన ఆర్డీటీ క్రీడా గ్రామం అనతి కాలంలోనే తన కీర్తిని ఇనుమడింపజేసుకుంది. స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రమాణాలు పాటిస్తుండడంతో దులీప్ ట్రోఫీ నిర్వహణకు అవకాశం దక్కింది. పేద, మధ్య తరగతి క్రీడాకారులకు దన్నుగా నిలుస్తూ ఎంతో మంది ప్రతిభావంతులను క్రీడల వైపు ఆసక్తి పెరిగేలా కృషి చేసిన ఫాదర్ ఫెర్రర్ ఆశయం నెరవేరుతోందని క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభిమానులకు పండగే..
టోర్నీ సందర్భంగా సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్, పంత్ తదితర క్రికెట్ స్టార్లు నగరానికి రానున్నారు. తమ ఆటతో అభిమానులను మురిపించనున్నారు. భారత జట్టు క్రికెటర్లలో ముగ్గురు మినహా అందరూ దులీప్ ట్రోఫీలోని జట్లలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ క్రమంలో తమ అభిమాన క్రికెటర్ల రాక కోసం యువత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నగరంలోని రెండు త్రీ స్టార్ హోటళ్లలో భారత క్రికెటర్లకు బస ఏర్పాట్లు చేస్తున్నారు.

దులీప్ ట్రోఫీలో ప్రాతినిధ్యం వహించే జట్లు ఇవే..

టీమ్-ఏ: శుభమన్ గిల్ (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, కేఎల్ రాహుల్, తిలక్ వర్మ, శివమ్ దూబే, తనుస్ కోటియన్, కులదీప్ యాదవ్, ఆకాష్ దీప్, ప్రసిద్ధ్‌కృష్ణ, ఖలీల్ అహమ్మద్, అవేశ్ ఖాన్, విద్వత్ కావేరప్ప, కుమార్ కుషగ్ర, షస్వత్ రావత్.

టీమ్-బీ: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, రిషబ్ పంత్, ముషీర్ ఖాన్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, సిరాజ్, యశ్ దయాల్, ముకేష్ కుమార్, రాహుల్ చహర్, ఆర్ సాయి కిశోర్, మోహిత్ అశ్విత్, ఎన్. జగదీషన్ (వికెట్ కీపర్)

టీమ్-సీ: రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటిదార్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, బి. ఇంద్రజిత్, హార్దిక్ షోకీన్, మనవ్ సుతార్, ఉమ్రాన్ మాలిక్, వైశాఖ్ విజయ్‌కుమార్, అన్షుల్ కాంబోజ్, హిమాన్షు చౌహాన్, మయాంక్ మార్కండే, ఆర్యన్ జుయాల్ (వికెట్ కీపర్), సందీప్ వారియర్

టీమ్ -డీ: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అతర్వ టైడ్, యష్ దూబే, దేవదత్ పడిక్కల్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రికీ భూయి, షరాన్స్ జైన్, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, ఆదిత్య థాక్రే, హర్షిత్ రాణా, తుషార్‌దేశ్‌పాండే, ఆకాష్ సేన్ గుప్తా, కేఎస్. భరత్ (వికెట్ కీపర్), సౌరభ్ కుమార్.

గర్వకారణం



ఇలాంటి పెద్ద ఈవెంట్ జరగడం అనంతపురం జిల్లా చరిత్రలోనే తొలి సారి. ఇటువంటి మ్యాచ్‌లు జరుగుతాయని ఊహించలేదు. ఇంత మంది స్టార్ క్రికెటర్లు వస్తారని కలలో కూడా అనుకోలేదు. దులీప్ ట్రోఫీ వంటి వాటి నిర్వహణకు కేవలం గ్రౌండ్ ఒక్కటే సరిపోదు. క్రికెటర్లకు అధునాతన సౌకర్యాలు కల్పించాలి. ఇటువంటి టోర్నీల వల్ల జిల్లా క్రికెటర్లకు స్ఫూర్తి కలుగుతుంది. ఆర్డీటీ క్రీడా గ్రామంలో రెండు గ్రౌండ్లు ఉన్నాయి. ఒకే సమయంలో రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. చాలా పెద్ద పని. చాలా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. అందరి సహకారంతో ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేస్తాం. సెప్టెంబర్ 5 నుంచి 22 వరకూ టోర్నీ జరుగుతుంది. భారత జట్టులోని ముగ్గురు క్రీడాకారులు మినహా తక్కిన వారందరూ ఈ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

– మాంఛో ఫెర్రర్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ మెంబర్

తుంగభద్ర గేటు అమర్చడంలో ఇంజినీర్ల కృషి అమోఘం

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



ఉరవకొండ: కొట్టుకుపోయిన తుంగభద్ర జలాశయం 19వ గేటు స్థానంలో కొత్తగా గేటు అమర్చడంలో ఇంజినీర్లు సాగించిన కృషి అమోఘమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి కొనియాడారు. ఆదివారం అనంతపురంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగభద్ర డ్యాం గేటు గల్లంతు కావడంతో జిల్లా రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తుంగభద్ర బోర్డు యాజమాన్యం, ఇంజినీర్లు, వందలాది మంది కార్మికులు విజయవంతంగా స్టాప్ లాగ్ అమర్చడం అభినందనీయమన్నారు. ఇందుకు కృషి చేసిన నిపుణుడు కన్నయ్య నాయుడు, మండలి కార్యదర్శి రామకృష్ణారెడ్డి, పర్యవేక్షక ఇంజినీర్ శ్రీకాంత్‌రెడ్డి, ఇంజినీర్లు, నిపుణులైన కార్మికులు, క్రేన్ ఆపరేటర్లు, ప్రత్యక్షంగా, పరోక్షంగా చేయూత అందించిన ప్రతి ఒక్కరికీ జిల్లా ప్రజలు, రైతాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన కర్ణాటక సీఎం సిద్దరామయ్య, నాలుగు రోజులు అక్కడే ఉండి పనులు చేయించిన మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్, మండలి కార్యదర్శి రామకృష్ణారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆరు కాళ్ల గొర్రె పిల్ల జననం



వజ్రకరూరు: మండలంలోని ధర్మపురి గ్రామంలో ఆరు కాళ్లతో ఓ గొర్రెపిల్ల జన్మించింది. గ్రామానికి చెందిన ఎరికల నల్లప్ప 80 గొర్రెలు, 20 మేకల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం మేపు నుంచి తిరిగి వచ్చిన తర్వాత జీవాలను ఇంటి వద్ద ఉన్న దొడ్డిలో ఉంచాడు. ఆదివారం ఉదయం నిద్రలేచి దొడ్లోకి వెళ్లి చూస్తే ఆరు కాళ్లతో జన్మించిన గొర్రె పిల్ల ఎంతో ఆరోగ్యంగా కనిపించింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, ఆరు కాళ్లతో జన్మించిన గొర్రె పిల్ల పైకి లేచేందుకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక పశువైద్యాధికారి దృష్టికి యజమాని తీసుకెళ్లాడు.

రైల్వే ప్రయాణికుల భద్రతకు పెద్దపీట

- జీఆర్‌పీ నూతన ఎస్పీ రాహుల్ మీనా

గుంతకల్లు: ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తామని ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) గుంతకల్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా పేర్కొన్నారు. ఇప్పటివరకూ జీఆర్‌పీ ఎస్పీగా ఉన్న చౌడేశ్వరిని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ప్రభుత్వం బదిలీ చేసింది. అల్లూరి సీతారామ రాజు జిల్లా చింతూరు అదనపు ఎస్పీగా ఉన్న రాహుల్ మీనాకు పదోన్నతి కల్పించి గుంతకల్లు రైల్వే జిల్లా ఎస్పీగా నియమించింది. దీంతో ఆయన ఆదివారం స్థానిక జీఆర్‌పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తనది 2019 ఐపీఎస్ బ్యాచ్ అన్నారు. రెండో పోస్టింగ్‌లో పదోన్నతిపై గుంతకల్లు రైల్వేకు బదిలీ అయినట్లు చెప్పారు. డివిజన్ స్థితిగతులు, సిబ్బంది ఇబ్బందులపై ఆరా తీస్తానన్నారు. సిబ్బంది కొరతపై ఐజీతో మాట్లాడతానన్నారు. ప్రయాణికుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించి, పక్కాగా అమలు చేస్తామన్నారు. అనంతరం రైల్వే ఎస్పీ రాహుల్ కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు గుంతకల్లు డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ నగేష్ బాబుతోపాటు డివిజన్ పరిధిలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఆయనకు పుష్పగుచ్ఛాలు, పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న రైల్వే ఎస్పీ రాహుల్ మీనా

ఎస్కేయూ హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వైదేహి ఆత్మహత్యకు ప్రయత్నించింది. వివరాలిలా ఉన్నాయి.. వర్సిటీలోని కావేరి హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని శనివారం అర్ధరాత్రి మోతాదుకు మించి ఐరన్ మాత్రలు ఒకేసారి మింగడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. గుర్తించిన తోటి విద్యార్థినులు వెంటనే ఆమెను వర్సిటీ అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ఆమె కోలుకుంటున్నట్లు సమాచారం. దీంతో సోమవారం ఉదయం జరిగే వైవాకు ఆమె హాజరు కావచ్చునని వైద్యులు భరోసానిచ్చారు. కాగా, ఆమె ఆత్మహత్యాయత్నాన్ని నెల్లూరులో ఉన్న తల్లిదండ్రులకు వర్సిటీ అధికారులు చేరవేశారు. ఈ అఘాయిత్యానికి గల కారణాలపై స్పష్టత లేదు.

కలహాల కాపురం



- అధికార పార్టీలో అప్పుడే మొదలైన వర్గపోరు
- అనంతపురంలో దగ్గుపాటి వర్సెస్ వైకుంఠం
- 'బియ్యం దొంగ' నువ్వంటే నువ్వంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు
- శింగనమలలో ఎమ్మెల్యేను లెక్కచేయని ద్విసభ్య కమిటీ
- ఎమ్మెల్యే సిఫారసు చేసిన డీలర్‌షిప్‌లకు బ్రేక్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అధికారం చేపట్టి మూడు మాసాలు కూడా కాకమునుపే అధికార పార్టీలో కలహాల కాపురం మొదలైంది. కొన్ని నియోజకవర్గాల్లో 'తమ్ముళ్లు' రెండు వర్గాలుగా విడిపోయి నిత్యం పోట్లాడుకుంటుండడంపై సామాన్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. హామీలు నెరవేరుస్తామని, సంపద సృష్టిస్తామని ఊరూరా వచ్చి ప్రచారం చేస్తే ఏమో అనుకున్నామని, ఇదేనా మీ సంపద సృష్టి అంటూ ఎద్దేవా చేస్తున్నారు. ముఖ్యంగా అనంతపురం, శింగనమల నియోజకవర్గాల్లో వర్గపోరు తారస్థాయికి చేరింది.

అర్బన్‌లో రాజుకున్న అగ్గి..
అనంతపురం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి మధ్య వర్గపోరు పతాక స్థాయికి చేరింది. బియ్యం దొంగ నువ్వంటే నువ్వేనంటూ పరస్పరం సోషల్ మీడియాలో యుద్ధం చేసినంత పనిచేశారు. తొలుత ప్రభాకర్ చౌదరి మనుషులే మాధవి అనే మహిళతో వాయిస్ రికార్డింగ్ చేయించి బ్లాక్‌మార్కెట్‌కు బియ్యం తరలిస్తున్నట్టు మీడియాకు ఇచ్చారని ఎమ్మెల్యే దగ్గుపాటి వర్గం ఆరోపిస్తుండగా.. పాతూరులో కావాలని తన అనుచరులు బ్లాక్‌మార్కెట్‌కు బియ్యం తరలిస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రచారం చేశారని వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఏకంగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగకుండా అనంతపురం నియోజకవర్గంలో నిర్బంధ వసూళ్లు జరుగుతున్నట్టు ఆరోపించారు. ఇద్దరూ అధిష్టానానికి ఫిర్యాదులు చేసుకుంటున్నారు. అధికారం వచ్చింది.. అభివృద్ధి పనులు చేయాల్సింది పోయి ఇలా కుమ్ములాడుకోవడం ఏంటని ప్రజలు మండిపడుతున్నారు. దగ్గుపాటి అంతుచూస్తానని ప్రభాకర్ చౌదరి అంటుండగా..చౌదరి నైజం అందరికీ తెలుసునని దగ్గుపాటి వర్గం అంటోంది. ప్రభాకర్ చౌదరికి నామినేటెడ్ పోస్టు సైతం రాకుండా అడ్డుకునేందుకు దగ్గుపాటి వర్గం విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఈయన పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

శింగనమలలో రచ్చకెక్కిన వ్యవహారం..
శింగనమల అంటేనే తెలుగుదేశం పార్టీలో వర్గపోరుకు చిరునామాగా ఉంది. ఇటీవలి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బండారు శ్రావణి గెలిచారు. ఈమె గెలుపును నియోజకవర్గంలో పార్టీ ఏర్పాటు చేసిన ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు ఏ మాత్రమూ జీర్ణించుకోలేకపోతున్నారు. తాజాగా ఎమ్మెల్యే శ్రావణి ద్విసభ్య కమిటీ సభ్యులను కాదని రేషన్ షాపుల డీలర్‌షిప్పులను తన వర్గీయులకు ఇచ్చుకున్నారు. దీంతో ద్విసభ్య కమిటీ సభ్యులు అధిష్టానానికి ఫిర్యాదులు చేయించి 52కు పైగా డీలర్‌షిప్పులను ఆపించారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల విషయంలోనూ శ్రావణి పెత్తనం చెల్లదంటూ ద్విసభ్య కమిటీ అంటోంది. 'ఎమ్మెల్యేను నేను కదా.. వాళ్లెవరు' అని శ్రావణి అంటుండగా..మధ్యలో అధికారులు నలిగిపోతున్నారు. వీరి వ్యవహారంతో ముఖ్యంగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు తల పట్టుకుంటున్నారు. కూటమి పాలన అంటే ఇదేనా అంటున్నారు. కుమ్ములాటల కారణంగా అభివృద్ధి పూర్తిగా స్తంభించిపోయినట్టు విమర్శలు వస్తున్నాయి.

చిత్రం.. భావం అనంతం!





అనంతపురం రూరల్ పరిధిలోని కట్టకింద పల్లి వద్ద వర్ణాలద్దుకున్న ఆకాశం

మయూరం.. రాజసం: సోములదొడ్డి వద్ద ఆకట్టుకుంటున్న నెమలి

కనులను ఆకట్టుకుంటుంది... మనసులను కదిలిస్తుంది... భావం విప్పేస్తుంది... ఫొటోకున్న విశిష్టత గురించి చెప్పాలంటే ఎన్ని మాటలైనా సరిపోవేమో! అందుకే వేయి మాటల్లో చెప్పే విషయాన్ని ఓ చిత్రంలో చెప్పవచ్చు అని అంటారు. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే. ఈ సందర్భంగా ప్రకృతి గీసిన చిత్రాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

క్లుప్తంగా

వ్యాపారి ఆత్మహత్య



మృతుడు ఆదినారాయణ

గుంతకల్లు టౌన్: రైల్వేస్టేషన్‌లో సమోసాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న ఆదినారాయణ(43) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని సోనియాగాంధీ కాలనీలో నివాసముంటున్న ఆదినారాయణకు భార్య సుమలత, ముగ్గురు పిల్లలున్నారు. శనివారం మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుంది. పిల్లలు చేతికొచ్చారని, కష్టపడి సంపాదించిన సొమ్మంతా తాగుడుకే ఖర్చు పెడితే అప్పులు ఎలా తీరుస్తారంటూ ఆ సమయంలో ఆయనను భార్య మందలించింది. దీంతో క్షణికావేశానికి లోనైన ఆదినారాయణ ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం సీఐటీయూ కాలనీలో ఉన్న పాత ఇంటికెళ్లి చూస్తే చీరతో వేసుకున్న ఉరికి విగత జీవిగా వేలాడుతున్న ఆదినారాయణ కనిపించాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రెండిళ్లలో చోరీ

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక రాచప్ప వీధిలోని రెండు ఇళ్లలో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన మేరకు... రాచప్ప వీధిలో నివాసముంటున్న కామరాజు తన కుటుంబసభ్యులతో కలసి శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట జరిగే శుభకార్యానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు శనివారం అర్ధరాత్రి తర్వాత ఇంట్లోకి చొరబడి బీరువాలోని రూ.30 వేలు నగదు అపహరించారు. అనంతరం అదే వీధిలో నివాసముంటున్న శివ ఇంటికి వేసిన తాళాన్ని గమనించి, లోపలకు చొరబడ్డారు. రూ.1.50లక్షల విలువ చేసే రెండు జతల కమ్మలు, ఓ జత మాటీలు అపహరించుకెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చిన కామరాజు, శివ... తమ ఇళ్ల తలుపులు తీసి ఉండడం గమనించి లోపలకెళ్లి పరిశీలించారు. చోరీ జరిగిన విషయాన్ని నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో సీఐ హరినాథ్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: ప్రతిభావంతులైన రజక విద్యార్థులను ప్రోత్సహిస్తూ పురస్కారాలను అందజేయనున్నారు. ఈ మేరకు రజక ఉద్యోగ, విద్యావంతుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కమ్మన్న ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2023-2024 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 500 మార్కులకు పైన, ఇంటర్ సైన్స్ గ్రూపులో 850కు పైన, ఆర్ట్స్ గ్రూపులో 750 పైన మార్కులు తెచ్చుకున్న వారు అర్హులు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తులను 'పి.ప్రభాకర్, డోర్.నం. 1/3/761, రజకనగర్, సోమనాథనగర్ సమీపంలో, అనంతపురం' చిరునామాకు చేరేలా పంపాలి. పూర్తి వివరాలకు 94405 01188, 94918 71141లో సంప్రదించవచ్చు.

బండబారిన బతుకులకు సాన

ఆత్మవిశ్వాసమే ఆడపిల్లలకు ప్రధాన ఆయుధమని నమ్మిన మహిళలు.. ప్రమాదకరమైన పనుల్లోనూ రాణిస్తున్నారు. బతుకు తెరువు కోసం బండల పరిశ్రమల్లో కార్మికులుగా చేరి పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో తాము పనిచేస్తున్న పరిశ్రమనే లీజుకు తీసుకుని నిర్వహిస్తున్న వారు కొందరు కాగా, ఉపాధిని వెదుక్కొంటూ వచ్చిన వారు మరికొందరు ఉన్నారు. ప్రాంతాలు వేరైనా.... అందరి లక్ష్యం ఒక్కటే. తమలా పిల్లలు కష్టపడకూడదని, వారు ఎంతో ఉన్నతంగా జీవించాలనే ఆశయంతో నిత్య శ్రమజీవులుగా మారారు. తాము శ్రమిస్తూ కుటుంబ ఉన్నతికి పాటుపడుతున్న మహిళలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- కడప స్లాబ్ యూనిట్లలో కీలకంగా మహిళలు
- బరువైన, ప్రమాదకరమైన పనుల్లోనూ రాణిస్తున్న వైనం





అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్న కడప స్లాబ్ యూనిట్‌లో పనిచేస్తున్న ధనలక్ష్మి

తాడిపత్రి రూరల్: విధివంచితులు... నిరాశ్రయులైన మహిళలకు తాడిపత్రి పరిసర ప్రాంతాల్లోని కడప బండల స్లాబ్ యూనిట్లు కల్పతరువుగా మారాయి. ప్రమాదకరమైన పనుల్లోనూ పురుషులతో సమానంగా రాణిస్తూ అంచెలంచెలుగా ఎదుగుతున్నారు. తాడిపత్రి పట్టణ సరిహద్దులోని సజ్జలదిన్నె క్రాస్, పప్పూరు క్రాస్, చిన్నపొలమడ, చుక్కలూరు క్రాస్ తదితర ప్రాంతాల్లో దాదాపు వెయ్యి వరకూ కడప స్లాబ్ యూనిట్లు ఉండగా... వివిధ కారణాలతో సగానికి పైగా మూతబడ్డాయి. మిగిలిన యూనిట్లలో కూలీలుగా వందలాది మంది పనిచేస్తున్నారు.

మూడు జిల్లాల వారికి కల్పతరువుగా...

తాడిపత్రి ప్రాంతంలోని కడప స్లాబ్ యూనిట్లు మూడు జిల్లాల వారికి కల్పతరువుగా మారాయి. ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాల సరిహద్దు మండలాల వ్యవసాయ కూలీలు సొంతూళ్లలో కరువు కారణంగా పనులు లభ్యం కాక తాడిపత్రి ప్రాంతానికి వలస వచ్చి కడప బండల స్లాబ్ యూనిట్లలో కార్మికులుగా చేరారు. వీరిలో అత్యధికులు విధివంచితులైన మహిళలే కావడం గమనార్హం. ముడి బండలు తీసుకొచ్చి పాలిష్ పట్టి తిరిగి నడిపించుకెళ్లే క్రమంలో బండలు పగిలి తీవ్ర రక్త గాయాలైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అయినా ఏ మాత్రం భయపడకుండా పనిలో తమను మించిన నిష్ణాతులు మరెవ్వరూ లేరని నిరూపిస్తున్నారు. విద్యుత్ మోటార్ సాయంతో బండలను పాలిష్ చేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై పలువురు మృత్యువాత పడ్డారు. మరి కొందరు వికలాంగులుగా మారారు. ప్రమాదకరంతో పాటు బరువైన పని అయినా మహిళలు ధైర్యంతో ముందుకు సాగుతున్నారు. పనులు సక్రమంగా సాగితే వారానికి రూ.2,500 నుంచి రూ. 3 వేల వరకూ కూలి గిట్టుబాటవుతోంది. ఇలా సంపాదించిన సొమ్ములో అత్యధిక శాతం పిల్లల చదువుల కోసం ఖర్చు పెడుతుండడం గమనార్హం.

శింగనమల మండలం కొరివిపల్లి గ్రామానికి చెందిన ధనలక్ష్మి ఏ రోజూ బడి ముఖం చూసి ఎరుగదు. తన భర్తతో కలసి సొంతూరిలో వ్యవసాయ కూలి పనులకు వెళ్లేది. అరకొర పనులతో ఇద్దరి పిల్లలను పోషించుకోవడం భారం కావడంతో బతుకు తెరువు కోసం తాడిపత్రికి వలస వచ్చారు. ఈ క్రమంలో భర్తతో కలసి కడప బండల స్లాబ్ యూనిట్‌లో కార్మికురాలిగా పనిలో చేరింది. కొన్ని రోజుల్లోనే పనిలో నిష్ణాతురాలుగా రాటుదేలిన ఆమె... కూలీగా ఉండడం కంటే యజమానిగా ఉంటే తనలాంటి మరో పది మందికి ఉపాధి కల్పించవచ్చునని భావించింది. అనుకున్నదే తడవుగా... మూతపడిన ఓ యూనిట్‌కు నెలకు రూ.13వేలు బాడుగ చెల్లించేలా ఒప్పందం చేసుకుని లీజుకు తీసుకుంది. ప్రస్తుతం తన యూనిట్‌లో భర్తతో పాటు తానూ పనిచేస్తూ మరికొందరికి పనులు కల్పిస్తున్న ధనలక్ష్మి... తన ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఇడుపులపాయలో, మరొకరిని శ్రీకాకుళంలోని ట్రిపుల్‌ఐటీలో చదివిస్తోంది.

వ్యథా భరిత జీవితం నుంచి బయటపడి

ఈమె పేరు కల్పన... కల్పితం కాని వ్యథా భరిత జీవితానికి నిలువెత్తు అద్దం ఆమె. వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం వేపరాలలో నిరుపేద కుటుంబంలో జన్మించింది. నాల్గో తరగతితోనే చదువులను అటకెక్కించి చిరుప్రాయంలోనే తల్లిదండ్రులతో కలసి కూలి పనులకెళ్లేది. ఈ క్రమంలోనే ట్రాక్టర్ పనికి వెళుతున్న యువకుడితో ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. కులాలు వేరు కావడంతో పెద్దలు వద్దన్నా వినకుండా ఆ యువకుడిని పెళ్లి చేసుకుంది. ఓ కుమారుడు, కుమార్తె కలిగిన తర్వాత వివాహ బంధానికి భర్త వక్రభాష్యం చెప్పాడు. మరో మహిళతో వివాహేతర సంబంధం మోజులో ఇల్లాలిని, పిల్లలను నిర్లక్ష్యం చేశాడు. నెలల తరబడి ఇంటి ముఖం చూడకుండా ఒంటరిని చేశాడు. పలుమార్లు పోలీసులను ఆశ్రయించినా న్యాయం చేకూరలేదు. పైగా, భర్తకే పోలీసులు వత్తాసు పలికేవారు. ఈ క్రమంలో తనపై పోలీసులకు ఫిర్యాదు చేశావంటూ ఇంటికి వచ్చి చితకబాదేవాడు. భర్త వేధింపులు భరించలేక వేరుగా ఉంటానని, తన జోలికి రాకుండా దూరంగా ఉండేటట్టు చూడాలని, అవసరమైతే భర్త నుంచి విడిపోవడానికి సిద్ధమేనని పోలీసుల ముందు వాపోయినా ఎవరూ పట్టించుకోలేదు. తమను కాదని పెళ్లి చేసుకుంది.. ఇప్పుడు అనుభవిస్తోందంటూ పుట్టింటి వారు సైతం నిర్లక్ష్యం చేశారు. దీంతో పట్టుమని పాతికేళ్ల లోపు వయసులోనే చిన్నారులను వెంటబెట్టుకుని తాడిపత్రికి చేరుకుంది. అద్దె ఇంట్లో ఉంటూ బండల పాలిష్ యూనిట్‌లో కార్మికురాలిగా చేరింది. ప్రస్తుతం కల్పన కుమారుడికి ఏడేళ్లు, కుమార్తెకు ఆరేళ్లు కాగా, వారిని స్థానికంగానే ఆమె చదివించుకుంటోంది.



బండలను పాలిష్ చేసిన అనంతరం తీసుకెళుతున్న కల్పన



బండను పాలిష్ చేస్తున్న వెంకటలక్ష్మి

నాకు, నా భర్తకూ చదువులు అబ్బలేదు. ముగ్గురు పిల్లలు ఉన్నారు. సొంత ఆస్తిపాస్తులూ లేవు. సొంతూరిలో వ్యవసాయ పనులతో జీవనం సాగించే వాళ్లం. కొన్నేళ్ల క్రితం కరువు కారణంగా వ్యవసాయ పనులు లేక చాలా ఇబ్బంది పడ్డాం. పూట గడవడం కష్టమైంది. పొట్ట చేత పట్టుకుని కుటుంబంతో కలసి తాడిపత్రికి వలస వచ్చి కడప స్లాబ్ యూనిట్‌లో కార్మికులుగా చేరాం. మొదట్లో పని చాలా కష్టంగా ఉండేది. రానురాను అలవాటైంది. వారానికి రూ.2,500 నా కూలితో పాటు భర్త సంపాదన కలుపుకుంటే రూ.5వేలు వస్తోంది. ప్రస్తుతం జీవనం సాఫీగా సాగుతోంది. పిల్లలనూ బాగా చదివించుకుంటున్నాం. – వెంకటలక్ష్మి, కోడుమూర్తి గ్రామం, యల్లనూరు మండలం

పిల్లలను బీటెక్ చదివిస్తున్నా..



మా ఊళ్లో పనులు లేకపోవడంతో తాడిపత్రికి వలస వచ్చాను. చుక్కలూరు రోడ్డులోని కడప స్లాబ్ యూనిట్‌లో భర్తతో కలసి పని చేస్తున్నా. బండలను పాలిష్ చేస్తుంటాను. మా ఇద్దరి సంపాదన కలిపి నెలకు రూ.25 వేల వరకు ఉంటోంది. ఈ డబ్బుతో మా పిల్లలను చదివించుకుంటున్నాం. ఇద్దరు ఆడపిల్లలనూ బీటెక్ చేయిస్తున్నా. – రంగమ్మ, సింగనగుట్టపల్లి, శింగనమల మండలం

ఏళ్లుగా ఇదే పని



కర్నూలు జిల్లా ఇటిక్యాల గ్రామం నుంచి కొన్నేళ్ల క్రితం నా భర్తతో కలసి తాడిపత్రికి వలస వచ్చాను. అప్పటి నుంచి కడప బండల స్లాబ్ యూనిట్‌లోనే పనిచేస్తున్నా. బరువైన పని కావడంతో పని ప్రాంతంలో గాయపడిన సందర్భాలు చాలా ఉన్నాయి. గాయాలయ్యాయి కదా అని భయపడితే పూట గడవదు. అందుకే మొండిగా ఇదే పనిలోనే రాణిస్తున్నాం. నా సంపాదన కుటుంబ అవసరాలకు ఎంతో ఉపయోగపడుతోంది. – లక్ష్మీదేవమ్మ, ఇటిక్యాల, కర్నూలు జిల్లా

పోలీసుల అదుపులో గుప్త నిధి వేటగాళ్లు

- వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డ ఆరుగురు
- అందులో ఇద్దరి పరారీ
- పశుపతినాథ ఆలయంలో విధ్వంసానికి పాల్పడిన వారేనని అనుమానాలు

రాయదుర్గం: గుప్త నిధి వెలికి తీసేందుకు వెళుతున్న ఓ ముఠాను రాయదుర్గం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం అర్ధరాత్రి రాయదుర్గంలోని బళ్లారి మార్గంలో కుంటు మారెమ్మ ఆలయం సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కేఏ50పీ 7097 నంబరు గల కారును ఆపి తనిఖీ చేశారు. కారులో ఆరుగురితో పాటు గ్యాస్ కట్టర్లు, రెండు గ్యాస్ సిలిండర్లు, గడ్డపారలు, చెలికి, పూజాసామగ్రి, ఓళిగ, కుంకుమ గుర్తించారు. ఈ లోపు దుండగుల్లో ఇద్దరు అక్కడి నుంచి పారిపోవడంతో నలుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గుప్తనిధి వెలికి తీసేందుకే వారు వెళుతున్నట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారించుకున్న పోలీసులు... నిందితులను తమ అదుపులో ఉంచుకుని విచారణ చేస్తున్నారు. కాగా, రాయదుర్గం మండలం చదం గ్రామ సమీపంలోని లింగాలబండపై కొలువుదీరిన చతుర్ముఖ పశుపతినాథ ఆలయంలో ఈ నెల 12న రెండు నంది విగ్రహాలను దుండగులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న దుండగులు... విగ్రహాలు ధ్వంసం చేసిన వారు ఒక్కరేననే అనుమానాలు వ్యక్తమయ్యాయి. దేశంలో నేపాల్ తర్వాత లింగాలబండపై వెలసిన ఈ ఆలయానికి చాలా ప్రాముఖ్యత ఉంది. శివలింగానికి నాలుగువైపులా కొలువుదీరిన నందీశుల విగ్రహాల్లో రెండింటిని దుండగులు ధ్వంసం చేశారు. వాటిలో వజ్రాలు ఉండొచ్చనే అనుమానంతో ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు వదంతులు వ్యాపించాయి. గుప్తనిధులు తవ్వేందుకు వెళుతూ ఆ ప్రాంత సమీపంలోనే దుండగులు పోలీసులకు పట్టుబడడం పశుపతినాథుడి మహిమేనని భక్తులు భావిస్తున్నారు.

దోపిడీ రాజ్యంపై దండెత్తాలి

- గద్దర్ వర్ధంతి సభలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



గద్దర్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ప్రజా గాయకుడు గద్దర్ స్ఫూర్తితో దోపిడీ రాజ్యంపై దండెత్తాలని, మూగబోయిన ఆయన గొంతు నుంచి రాగమందుకోవాల్సింది జనమేనంటూ జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. బహుజన యువసేన, సామాజిక న్యాయ ఉద్యమ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలో గద్దర్ వర్ధంతి సభ నిర్వహించారు. బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశ్యర్ల హరి అధ్యక్షతన జరిగిన ఈ సభకు జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు గద్దర్ కుమార్తె డా.జి.వెన్నెలమ్మ, అరుణోదయ కళా మండలి అధ్యక్షురాలు విమలక్క, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంత ప్రజా గాయకుడు డా.దాసరి ఆదినారాయణ, సామాజిక న్యాయ ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి శంకర కుళ్లాయప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతకు ముందు జెడ్పీ ఎదుట ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, జెడ్పీ ఆవరణలోని సావిత్రీబాయిపూలే విగ్రహానికీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీపీఆర్‌సీ భవన్‌లో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, డా.జి.వెన్నెలమ్మ, విమలక్క ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మాట్లాడుతూ.. గద్దర్ లేని ప్రజా ఉద్యమాలను ఊహించలేమని, పీడితుల పాలిట శత్రువులైన అన్ని వర్గాల దొరల్ని గద్దర్ తన పాటలతో నిలదీసిన తీరును కొనియాడారు. న్యాయవాది గోని నాగన్న, బోయ నరేంద్ర, పోతుల రాధాకృష్ణ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రామన్న, బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రమేష్‌గౌడ్, విశ్రాంత జడ్జి కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యం పట్టివేత

కణేకల్లు: మండలంలోని ఆలూరు శివారులో కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న సబ్సిడీ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఏఎస్ఐ శంకర్‌రెడ్డి ఆలూరు శివారులో శనివారం అర్ధరాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఐచర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయడంతో 80 బస్తాల్లో తరలిస్తున్న రేషన్ బియ్యం బయటపడింది. దీంతో వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న ఓబులేసు, వరుణ్‌కుమార్, గురుస్వామిపై కేసు నమోదు చేశారు.

సర్దుబాటు వద్దు... ప్రమోషన్లు కల్పించండి

- హిందూపురం ఎంపీకి ఏపీటీఎఫ్ వినతి



ఎంపీ పార్థసారథికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు సర్దుబాటు ప్రక్రియ కాకుండా అర్హులైన వారికి పదోన్నతులు కల్పించి ఖాళీలను భర్తీ చేసేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం అనంతపురంలో హిందూపురం ఎంపీ పార్థసారథిని కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. విద్యా వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన జీఓలు 117, 128ను రద్దు చేయాలని కోరారు. పాఠశాలల్లో కేవలం ఇంగ్లిష్ మాధ్యమంలోనే కాకుండా తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలన్నారు. కొత్తగా సీబీఎస్‌ఈ సిలబస్‌లోకి మార్చిన పాఠశాలలను తిరిగి స్టేట్ సిలబస్‌కు మార్చేలా చూడాలన్నారు. డిమాండ్లను విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని ఈ సందర్భంగా వారికి ఎంపీ హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్ కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా శాఖ అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఆర్ చంద్ర, గౌరవ అధ్యక్షుడు పీవీ మాధవ, రాష్ట్ర కౌన్సిలర్ బీకే ముత్యాలప్ప, నాయకులు నరేష్ కుమార్, సీనియర్ నాయకులు త్రిమూర్తి, శ్రీనివాసులు, మల్లికార్జున, పి రవికుమార్, ఉమాపతి, నాగభూషణ ఉన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని తాటిచెర్ల సమీపంలో రైలు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. శరవేగంతో వెళుతున్న రైలు ఢీకొనడంతో తల తెగి పట్టాలపై పడింది. మిగిలిన దేహం పట్టాలకు దూరంగా విసిరేసినట్లుగా పడి ఉంది. మిస్సింగ్ కేసుల్లో సంబంధీకులు ఎవరైనా ఉంటే అనంతపురం రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ విజయ్‌కుమార్ కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న పోలీసులు

గుంతకల్లు టౌన్: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న అంతర్రాష్ట్రదొంగను అరెస్ట్ చేసి, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. ఆదివారం ఉదయం రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రదేశంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న కర్ణాటకలోని బళ్లారికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఆ సమయంలో పట్టణంలోని రైల్వేస్టేషన్, సౌత్‌క్యాబిన్, ట్విన్‌లైన్ తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లినట్లు అంగీకరించాడు. దీంతో ఇర్ఫాన్‌ను అరెస్ట్ చేసి, రూ.2.50 లక్షల విలువైన ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వవిద్యార్థులు

గుంతకల్లు: స్థానిక రైల్వే హైస్కూల్‌లో 2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారు పాతికేళ్ల తర్వాత అదే పాఠశాల వేదిక ఆదివారం కలిశారు. సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావుతో పాటు నాడు తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులు సుధాకర్, గుప్తా, రాజారెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, సాదిక్, రమణరావు, సైరాబాను, రఫీక్, సునీల్‌పాల్ ఘనంగా సన్మానించారు. నాటి అల్లర్లను గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడిగా గడిపారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు అజీమ్, శశికళ, షమీమ్, గౌస్, అజంతుల్లా, రజియాసుల్తానా, సూర్య, ఫిర్‌దోస్, మీన తదితరులు నేతృత్వం వహించారు.

అనుబంధాలకు ప్రతీక 'రాఖీ'

ఏటా శ్రావణ పౌర్ణమి వచ్చిందంటే సోదరసోదరీమణుల మధ్య ఆనందోత్సాహాలు నెలకొంటాయి. అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్ల బంధానికి ప్రతీకగా నిలిచిన రాఖీ పండుగ రానేవచ్చింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో, పట్టణాల్లో సందడి నెలకొంది. మార్కెట్లలో వివిధ రకాల రాఖీల విక్రయాలూ ఊపందుకున్నాయి. కులమతాలకు అతీతంగా రాఖీ పౌర్ణమిని నిర్వహించుకోవడంతో పాటు ద్విజులు తమ యజ్ఞోపవితాలను శాస్త్రోక్తంగా మార్చుకునే ఉపకర్మలు, హయగ్రీవ జయంతి, సత్యదేవుని వ్రతాలు, సంస్కృత దినోత్సవాన్ని సోమవారం వేడుకగా నిర్వహించుకునేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. – అనంతపురంకల్చరల్/యాడికి:

సందర్భం : నేడు రాఖీ పౌర్ణిమ



అనంతపురంలో తమ్ముడికి రాఖీ కడుతున్న గీతాసరయు



అనంతపురం భవానీనగర్‌లో అన్న షఫీ సాహెబ్‌కు రాఖీ కడుతున్న చెల్లెలు సాజిదాబేగం

భగవంతుడు ఏర్పరిచిన మార్గం



ఈశ్వరుడు మనిషిని ప్రశాంతంగా ఉంచేందుకు ఎన్నో మార్గాలను చూపెట్టాడు. అందులో ఎంతో ప్రాముఖ్యత ఉన్న రక్షాబంధన మహోత్సవం ఒక్కటి. కేవలం తోడబుట్టిన వారికి మాత్రమే కాకుండా సృష్టిలోని ప్రతి వ్యక్తిని సోదరభావంతో చూస్తూ అందరికీ రాఖీ కట్టడం ద్వారా కొత్త బంధాలను బ్రహ్మకుమారీలు ఏర్పరుచుకుంటున్నారు. – సిస్టర్ శారద, బ్రహ్మకుమారీ సంస్థ, అనంతపురం

అందుబాటులో కొత్త డిజైన్లు



గతంలో కంటే ఈ సారి రాఖీలు ఎక్కువ వెరైటీలు అందుబాటులోకి వచ్చాయి. హైదరాబాద్, కోల్‌కత్తా, విజయవాడ నుంచి 120కి పైగా వివిధ రకాల మోడళ్లను తెప్పించి విక్రయిస్తున్నాం. – రఘునాథ గుప్తా, వ్యాపారి, యాడికి

రాఖీ కట్టే వరకూ ఏ పనీ చేయను



చిన్నప్పటి నుంచి రాఖీ పండుగ అంటే ఎంతో ఇష్టం. వారం రోజుల ముందు నుంచే ప్లాన్ రెడీ చేసుకుంటుంటాం. దూర ప్రాంతంలో ఉన్న వారికి పోస్టు ద్వారా రాఖీలు పంపిస్తాం. దగ్గరలో ఉన్న అన్నదమ్ముల ఇంటికి స్వయంగా వెళ్లి రాఖీ కట్టి వచ్చే వరకూ ఏ పనీ చేయాలన్నా మనసొప్పదు. – లక్ష్మీదేవి, ఆస్పత్రి కాలనీ, యాడికి

యువకుడి ఆత్మహత్య



పూర్ణచంద్రారెడ్డి (ఫైల్)

యాడికి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... యాడికిలోని ఆంజనేయస్వామి కాలనీలో నివాసముంటున్న దుద్దేకుంట కులశేఖర్‌రెడ్డికి ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు పూర్ణ చంద్రారెడ్డి (23) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు చికిత్స చేయిస్తున్నారు. ఆదివారం రాత్రి నొప్పి తీవ్రత తాళలేని ఆయన ఇంట్లో ఎవరూ లేని 8 గంటల సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు... విగతజీవిగా ఉరికి వేలాడుతున్న కుమారుడిని చూసి బోరున విలపించారు. కాగా, ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

నీట మునిగిన వరి



న్యామద్దెలలో నీట మునిగిన వరి పంటను చూపుతున్న రైతు కాటమయ్య

చెన్నేకొత్తపల్లి: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వెల్దుర్తి, న్యామద్దెల గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంట నీట మునిగాయి. న్యామద్దెలలో కాటమయ్యకు చెందిన మూడున్నర ఎకరాల్లో నాటిన వరి మడి వర్షం నీటితో మునిగిపోయింది. అలాగే వెల్దుర్తిలో దాసరయ్యగారి చెన్నారెడ్డికి చెందిన ఒకటిన్నర ఎకరాలో సాగు చేసిన వరి మడి నీటి పాలైంది. వర్షంతో తమకు తీరని నష్టం జరిగిందని ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయాన్ని రైతులు మండల వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా మనోహర్

అనంతపురం ఎడ్యుకేషన్: బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా కురుగుంట మనోహర్‌ను నియమించారు. ఈ మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షులు మంజుల వెంకటేష్ ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అనంతపురం కార్పొరేషన్: నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరగనుంది. నగరపాలక సంస్థలోని సచివాలయంలో జరిగే కార్యక్రమంలో ఏమైనా సమస్యలుంటే తెలియజేయవచ్చని నగరపాలక సంస్థ అధికారులు పేర్కొన్నారు.

ఇస్తెమాను విజయవంతం చేద్దాం

అనంతపురం కల్చరల్: నగరంలో జరగనున్న జిల్లా తబ్లిక్ ఇస్తెమా విజయవంతం కావడానికి అందరం కృషి చేద్దామని మేయర్ వసీం పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి నగర శివారులోని మదరసాయే జియావుల్ ఉలూమ్‌లో బెంగళూరుకు చెందిన మత పెద్దలు, ఇస్తెమా నిర్వాహకులు, మౌల్వీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ కార్యదర్శి ఖాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు మెహ్రాజ్ తదితరులు మాట్లాడారు. జిల్లా కేంద్రంలో అనేక ఏళ్లుగా ఆధ్యాత్మిక సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది సాగే వేడుక కూడా ఘనంగా జరగడానికి తమ వంతు సహకారమందిస్తామన్నారు. వేల సంఖ్యలో హాజరయ్యే ముస్లింలు, మతపెద్దలకు అసౌకర్యం కలుగకుండా అన్ని వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పలు మసీదుల పెద్దలు, మౌలానాలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



మాట్లాడుతున్న విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రాజ్‌మోహన్

అనంతపురం కల్చరల్: రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని వక్తలు అన్నారు. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో నగరంలోని సంఘం కార్యాలయంలో, విద్యాసంస్థల్లో ఆదివారం వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ద్వారకా నగర్‌లో యునైటెడ్ సిటిజన్స్ ఫోరమ్ అధ్యక్షులు అబ్దుల్ రసూల్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రాజ్ మోహన్, కో కన్వీనర్ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. భారత రాజ్యాంగం శాసన, పరిపాలన, న్యాయవ్యవస్థలను సరైన మార్గంలో నడిపించే చక్కటి ముసాయిదా పత్రమని వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్ రాజు, యమున, సురేష్, ఉషా, విరూపాక్ష, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇటుకలపల్లి సీఐగా హేమంత్ బాధ్యతల స్వీకరణ



రాప్తాడురూరల్: ఇటుకలపల్లి పోలీసు స్టేషన్ సీఐగా జె.హేమంత్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీ సత్యసాయి జిల్లా సోషల్ మీడియా, సైబర్ సెల్ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఈయన ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడికి వచ్చారు. ఈయన ఉమ్మడి జిల్లాలోని కనగానపల్లి, రామగిరి, బత్తలపల్లి, కదిరి, ఎన్‌పీ కుంట, ముదిగుబ్బ స్టేషన్లలో ఎస్ఐగా పని చేశారు. కరోనా సమయంలో కోవిడ్ సెల్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ముదిగుబ్బ ఎస్ఐగా పని చేస్తున్న సమయంలో సీఐగా పదోన్నతి లభించింది.

కుక్కలున్నాయ్ జాగ్రత్త !

- గుంపులు, గుంపులుగా తిరుగుతూ జనంపై శునకాల దాడులు
- అటకెక్కిన కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- భయాందోళనలో ప్రజలు



రాప్తాడులో సంచరిస్తున్న వీధి కుక్కలు

రాప్తాడు: గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు, గుంపులుగా తిరుగుతూ మనుషులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. వాహనదారుల వెంట పడుతున్నాయి. చిన్నారుల ప్రాణాలను బలిగొంటున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. శస్త్ర చికిత్సలతో శునకాల సంతంతి తగ్గించాలని ప్రభుత్వం ఆదేశించినా ఆ దిశగా మాత్రం ఎవరూ చర్యలు చేపట్టడం లేదు.

పట్టణం నుంచి పల్లెల దాకా...

పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాతాల వరకూ శునకాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. నియోజకవర్గంలో రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని గ్రామాల్లో కుక్కలు చెలరేగిపోతున్నాయి. దీంతో రోజూ ఒకరిద్దరు కుక్క కాటుకు గురవుతున్నారు. వాహన చోదకులు కుక్కల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలవుతున్నారు. రాప్తాడు మండలంలో 2,200, అనంతపురం రూరల్‌లో 8,400, కనగానపల్లిలో 1,900, ఆత్మకూరులో 2,500, చెన్నేకొత్తపల్లిలో 3,200, రామగిరి మండలంలో 1,800 శునకాలు ఉన్నాయి.

పెరుగుతున్న కేసులు

రాప్తాడు నియోజకర్గంలో ఆరు మండలాల్లోని ప్రభుత్వాస్పత్రులకు రోజూ కుక్క కాటు బాధితులు వస్తుంటారని ఆయా పీహెచ్‌సీల వైద్యులు చెబుతున్నారు. కుక్క కరిచిన వారికి టీటీ ఇంజక్షన్‌తో పాటు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) నాలుగు డోస్‌లను 28 రోజుల వ్యవధిలో వేస్తారు. కుక్క కాటు తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి ఇమ్యునోగ్లోబులిల్స్ ఇంజక్షన్ కూడా అదనంగా చేస్తున్నారు. తల భాగానికి దగ్గరగా కుక్క కాటు పడిన వారికి అపాయం ఎక్కువగా ఉంటుందని, కుక్క కాటు బాధితుల మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు.

పట్టించుకోని అధికారులు

కుక్క కాటు బాధితుల సంఖ్య పెరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. శునకాల నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించడంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లోని మాంసం విక్రయ కేంద్రాల వద్ద వ్యర్థ పదార్థాలు తింటూ మనుషులు, పశువులపై దాడులు చేస్తున్నాయిని స్థానికులు వాపోతున్నారు.

బైక్‌పై వెళ్తుంటే వెంటపడుతున్నాయి



మాది ప్రసన్నాయపల్లి పంచాయతీలోని అయ్యవారిపల్లి. నేను రాప్తాడులో టైలర్ షాపు పెట్టుకొని జీవనం చేస్తున్నాను. రోజూ రాత్రి 9 గంటలకు పని ముగించుకొని ఇంటికి వెళ్లాలంటే కుక్కల దాడులతో భయమేస్తోంది. రాప్తాడు బస్టాండు ప్రాంతంలో బైక్‌పై వెళ్తున్నా 10 కుక్కలు వెంబడిస్తున్నాయి. ఒకరోజు బైక్‌పై నుంచి కిందపడడంతో స్థానికులు కుక్కల బారి నుంచి కాపాడారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలి.

– దండు ఎర్రిస్వామి, టైలర్, అయ్యవారిపల్లి

కుక్కలను దూరంగా వదలాలి



కుక్కల దెబ్బకు బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది. రోడ్ల వెంబడి గుంపులు, గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నాయి. పెద్దలు, స్కూల్ పిల్లలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం 9 గంటల సమయంలో మారెమ్మ దేవాలయం దగ్గర ట్యూషన్ నుంచి ఇంటికి వెళ్తున్న పిల్లలపై కుక్కలు దాడి చేశాయి. కుక్కల నుంచి ప్రజలను కాపాడాలని పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఓం ప్రకాష్, రాప్తాడు

వీరేష్‌కు సత్కారం



వీరేష్‌ను సత్కరిస్తున్న రిజ్వాన్, మిత్రబృందం

అనంతపురం కల్చరల్: జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో అవార్డుకు ఎంపికైన సాక్షి ఫొటోగ్రాఫర్ వీరేష్‌ను పలువురు సత్కరించారు. ఆదివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, శ్రీనివాసులు, శ్రీధర్, దాదా ఖలందర్, గిరి చరణ్, హనుమంతు తదితరులు వీరేష్‌కు శాలువ కప్పి సత్కరించారు. వీరేష్ ఫొటోలు ఎందరినో ప్రభావితం చేశాయని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని అభిలషించారు.

కృష్ణాష్టమి వేడుకలకు అనుమతి ఇవ్వండి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆదివారం ఎస్ఐ వెంకటేశ్వర్లును కోరారు. ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతగా జరుపుకోవాలని ఎస్ఐ వారికి సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక చెన్నేకొత్తపల్లి కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు మూడురోజుల నిర్వహిస్తామన్నారు. 26న శ్రీకృష్ణుడి విగ్రహాన్ని కొలువుదీరుస్తామన్నారు. 28 వరకూ రోజూ పూజలు చేస్తామన్నారు. 28వ తేదీన గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అనురాధ, శ్రీనివాసరెడ్డి, చిట్టెమ్మ, కిష్టప్ప, కొల్లారెడ్డి సుబ్బమ్మ పాల్గొన్నారు.

వైద్యుల రక్షణ చట్టం తీసుకురావాలి

- ఆప్ జూడా అధ్యక్షుడు డాక్టర్ హరికిరణ్



సర్వజనాస్పత్రి ఆవరణంలో రిలే దీక్షలు చేస్తున్న జూడాలు

అనంతపురం మెడికల్: కోల్‌కతాలో పీజీ విద్యార్థినిపై జరిగిన హత్యాచారం దారుణమని, భవిష్యత్తులో ఎక్కడా ఇటువంటి దారుణాలు చోటు చేసుకోకుండా వైద్యుల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని ఆప్ జూడా అధ్యక్షుడు హరికిరణ్ డిమాండ్ చేశారు. ఆప్ జూడా సమ్మెలో భాగంగా ఆదివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణంలో పీజీ విద్యార్థులు, హౌస్‌సర్జన్లు రిలే దీక్షలు చేపట్టారు. రిలే దీక్షల్లో పీజీ విద్యార్థులు డాక్టర్ తనికేష్, డాక్టర్ తేజ, డాక్టర్ వికాస్, హౌస్‌సర్జన్ సత్య కూర్చున్నారు. ఆప్ జూడాలు చేస్తున్న సమ్మెకు నేషనల్ హ్యూమన్ రైట్స్, ఏపీ టీచర్స్ ఫెడరేషన్, మహిళా సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా డాక్టర్ హరికిరణ్ మాట్లాడుతూ వైద్యులకు రక్షణ లేకుండా పోతోందన్నారు. చట్టాలు కఠినతరం చేస్తేనే వైద్యులపై దాడులు ఆగుతాయన్నారు. కోల్‌కతాలో జరిగిన ఘటనతో వైద్య విద్యార్థులు, వైద్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బోధనాస్పత్రిలోనూ దయనీయమైన పరిస్థితుల్లో పీజీ విద్యార్థులున్నారన్నారు. తాగునీటి సదుపాయం, బాత్‌రూంలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. నగరంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జీజీహెచ్ నుంచి కోర్టు రోడ్డు, క్లాక్‌టవర్ మీదుగా సప్తగిరి సర్కిల్, తిరిగి జీజీహెచ్ వరకు ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు.

స్టాఫ్‌నర్సులు, నర్సింగ్ విద్యార్థుల సేవలు

400 మందికిపైగా పీజీ విద్యార్థులు, హౌస్‌సర్జన్లు సమ్మెలోకి వెళ్లడంతో సర్వజనాస్పత్రిలో స్టాఫ్ నర్సులపైనే భారం పడింది. క్యాజువాలిటీ, ఏఎంసీ, ఐసీసీయూ, గైనిక్, లేబర్, మెడిసిన్, సర్జికల్, పల్మనాలజీ, ఆర్థో, ఈఎన్‌టీ తదితర విభాగాల్లో స్టాఫ్‌నర్సులే ఇంజెక్షన్లు వేశారు. వాస్తవంగా ఈ పనులను హౌస్‌సర్జన్లు చేయాలి. వారు సమ్మెలోకి వెళ్లడంతో ఆ బాధ్యతను స్టాఫ్‌నర్సులే తీసుకున్నారు. దీంతో పాటు నగరంలోని పద్మావతి, శ్రీసాయి, నిర్మల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులు మూడు షిఫ్టుల్లో రోగులకు సేవలందించారు.

ఆధార్ క్యాంపులు మళ్లీ వాయిదా

- సర్వర్ సమస్య వల్లే అంటున్న అధికారులు

ఆత్మకూరు: ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మండల స్థాయిలో అధికారులు పంచాయతీల వారీగా ఆధార్ క్యాంపులను నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ కొన్ని పంచాయతీల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం అవి వాయిదా పడినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. గత జూలై 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ మండలంలో ఆధార్ క్యాంపులు గ్రామ సచివాలయాల్లో నిర్వహించాలని అధికారులు తెలుపగా కేవలం రెండు రోజులు మాత్రమే సర్వర్‌లు పని చేయడంతో కొంత మంది ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకున్నారు. అప్పుడు కూడా సర్వర్ పని చేయలేదని చెప్పడంతో గతంలో కూడా ఆధార్ క్యాంపు సేవలను వాయిదా వేశారు. తిరిగి ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ పని చేయలేదనడంతో మళ్లీ ఆధార్ క్యాంపులను వాయిదా వేశారు. దీంతో ఆధార్ కార్డుల సమస్యలు ఉన్న వారికి మళ్లీ నిరాశే ఎదురైంది. ఆధార్ క్యాంపులు నిర్వహించే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని అధికారులు చెబుతున్నారు.

ఘనంగా జిహ్వేశ్వర మహరాజ్ జయంతి



జిహ్వేశ్వర్ చిత్రపటానికి పూజలు చేస్తున్న సంఘం పెద్దలు

అనంతపురం కల్చరల్: స్వకులశాలీయుల మూలపురుషుడైన జిహ్వేశ్వర మహరాజ్ జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక గుత్తిరోడ్డులోని అంబా భవానీ మాత ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యక్రమాలు సందడిగా జరిగాయి. తుల్జాపూర్ అంబా భవానీకి రుద్రాభిషేకం, అలంకార సేవలు నిర్వహించారు. జిహ్వేశ్వర మహరాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. స్వకులశాలీ సమాజంలో ఉన్నతంగా ఎదిగిన వారిని సత్కరించారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన చిన్నారులను గోల్డ్ మెడల్స్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారుల యోగా విన్యాసాలు, సాంస్కృతిక సంబరాలు ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో పాటు సంఘం అధ్యక్షులు సరోదే రాజేంద్రప్రసాద్, సెక్రటరీ మురళీకృష్ణ, ధర్మకర్త జుజారే సురేష్, ప్రభాకర్, పాండ్రే నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. స్వకులశాలీ సమాజాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. ఇదే పంథా కొత్త తరాల వారూ పాటించాలని కోరారు. ఐక్యతతో అభివృద్ధి సాధ్యమని అందరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు భానుప్రసాద్, కమ్లే గోవిందరావు, సపారె గోపీనాథరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు పునరంకితం కావాలి

- యువతకు కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం: యువత గొప్ప ఆలోచనలతో సమాజ శ్రేయస్సుకు పునరంకితం కావాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో వధాన్య జన సొసైటీ 13వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా కలెక్టర్ వినోద్‌కుమార్, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి హాజరయ్యారు. సమాజం పట్ల బాధ్యత కల్గిన యువత విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పుల గురించి, సమాజం పట్ల ఉండాల్సిన బాధ్యత గురించి మాట్లాడారు. వధాన్య సొసైటీ వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు.కార్యక్రమంలో వధాన్య జన సొసైటీ వ్యవస్థాపకులు అశోక్ పడపాటి, ఏపీ టీఎస్ రాష్ట్ర ఐటీ అడ్వైజర్ డాక్టర్ చౌదరి, ఆర్డీటీ కన్వామ్ టికెట్ సీఈఓ శ్రీపాద వైద్య, ప్రముఖ ఐటీ నిపుణుడు రామకుమార్, డిస్కవరి అనిల్, లెనిన్ బాబు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



నాగరాజు (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నాగరాజు(37) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడు నాగరాజు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు అనంతపురానికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య రాధతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



అలంకార సేవల్లో రాఘవేంద్రస్వామి



స్వామిని దర్శించుకోవడానికి వెళ్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డులో వెలసిన మంత్రాలయ రాఘవేంద్రస్వామి 353వ ఆరాధన ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. భజన గీతాల నడుమ తొలిరోజు గోపూజ, లక్ష్మీపూజ, ధాన్యోత్సవ కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. స్వామివారి బృందావనాన్ని గంధ లేపనం, పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించి ఆరాధనలు జరిపారు. ధ్వజారోహణంతో మరో నాలుగు రోజుల పాటు సాగే ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు మఠం మేనేజర్, అర్చకులు తెలియజేశారు. సోమవారం రుగ్వేద, యజుర్వేద సహిత ఉపాకర్మ, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, మంగళవారం పూర్వారాధన, బుధవారం మధ్యారాధన, గురువారం ఉత్తరారాధనతో వేడుకలు ముగుస్తాయన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలందుకోవాలన్నారు. అనంతరం మంత్రాలయ క్షేత్రంలో జరుగుతున్న తరహాలో మఠంలో వేదమంత్రాలు, సంకీర్తనల నడుమ రజత రథోత్సవ వేడుకలు నిర్వహించారు.

సంతల ఆదాయం రూ.2.18 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.2.18 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత ద్వారా రూ.1,26,400 వసూలు కాగా.. ఆదివారం జరిగిన పశువులు, ఎద్దుల సంత నుంచి రూ.92,010 మేర వసూలైందన్నారు. మూడు రోజులుగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఆదాయం తగ్గినట్లు తెలిపారు.

ఆత్మీయ వీడ్కోలు



ఎస్పీని సన్మానిస్తున్న పోలీసు అధికారులు

అనంతపురం: బదిలీపై వెళ్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ, అదనపు ఎస్పీలు ఆర్. విజయభాస్కర్ రెడ్డి, జి. రామకృష్ణకు పోలీసులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆదివారం రాత్రి పోలీస్ అతిథి గృహంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్పీ మురళీకృష్ణ జిల్లాలో తక్కువ కాలం పనిచేసినా తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. అదనపు ఎస్పీలు కూడా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించారన్నారు. కార్యక్రమంలో పలువురు డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

రహదారి ఇలా.. ప్రయాణం ఎలా?



అధ్వానంగా మారిన తూంచర్ల- అనంతపురం రోడ్డు



అదుపు తప్పి రహదారి పొలాల్లోకి వెళ్లిన స్కూల్ బస్సు (ఫైల్)

కనగానపల్లి: మండలంలోని తూంచర్ల నుంచి రంగంపేట మీదుగా అనంతపురం వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా మారింది. గుంతలమయంగా ఉన్న మట్టి రోడ్డు గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మరింత దెబ్బతింది. రహదారి వెంట ఎటూ చూసినా నీటి మడుగులే కనిపిస్తున్నాయి. దీంతో ఈ రహదారి గుండా వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం ఈ రహదారి గుండా వెళ్తున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సు బోల్తా పడకపోవడంతో విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. దీనికితోడు పలువురు ద్విచక్ర వాహనదారులు కూడా ప్రమాదాలకు గురైనట్లు స్థానికులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా నమోస్తుతే !



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మండల పరిధిలోని పంపనూరులో వెలసిన సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి ఆకుపూజ అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో అనంత ఘంటశాల ఆరాధన సమితి బృందం ఆలపించిన భక్తి గీతాలు అందరినీ అలరించాయి. ఆలయంలోని మంజునాథస్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. పార్వతిదేవికి అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. శ్రావణ మాసం కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో కాల సర్పదోష రాహుకేతు నివారణ హోమాలను నిర్వహించారు. శ్రావణ మాసం కావడంతో అనంతపురం నుంచి పంపనూరుకు ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశారు.

సమస్యలుంటే తెలియజేయండి

రాప్తాడు: ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయకుమారి ఒక ప్రకటనలో కోరారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలన్నారు.

ఇస్త్రీ పెట్టెలను ఎత్తుకెళ్లిన దొంగలు

రాప్తాడురూరల్: దుస్తులు ఇస్త్రీ చేసే పెట్టెలనూ దొంగలు వదలడం లేదు. ఎంచక్కా షట్టరు తాళం కోసేసి మూడు ఇస్త్రీ పెట్టెలను ఎత్తుకెళ్లిన ఘటన అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డులో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. కూడేరు మండలం గొటుకూరు గ్రామానికి చెందిన రవి రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కళ్యాణదుర్గం రోడ్డు నరిగిమ్మ ఆలయ సమీపంలో ఓ షాపు అద్దెకు తీసుకుని దుస్తులు ఇస్త్రీ చేసేవాడు. రెండు రోజుల కిందట రాత్రి దొంగలు పడి దుకాణంలో మూడు బొగ్గుల ఇస్త్రీ పెట్టెలను ఎత్తుకెళ్లారు. షట్టరుకు వేసిన తాళంను ఆక్సా బ్లేడుతో కట్ చేశారు. మరొకటి కరెంటు ఇస్త్రీ పెట్టె కూడా ఉండింది. ఇది వారి కంట పడకపోవడంతో వదిలేసి వెళ్లారు. చివరకు ఇస్త్రీ కోసం వచ్చిన రెండు దుస్తులను కూడా ఎత్తుకెళ్లారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.